# తెలంగాణాలో రైతుబంధు పథకం పేరిట భూపరాయీకరణ చర్యలు

**తెలంగాణ** రాష్ట్రప్రభుత్వం రైతుబంధు పేరిట ఓ పథకాన్ని అమలుచేస్తోంది. రాష్ట్రంలోని వ్యవసాయ భూయజమానులందరికీ ఎకరానికి ఏడాదికి 8 వేల రూ॥లను ప్రభుత్వం మదుపు సహాయం కింద అందజేస్తుంది. 2018 మేలో తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించాడు. పట్టాదార్ పాస్‌పుస్తకాలతో సహా ఖరీఫ్ సీజన్‌లో మదుపు సహాయం క్రింద ఎకరాకు 4 వేల రూ॥ చొప్పున పంపిణీ చేశారు. రెండోవిడత రబీ సీజన్‌లో ఈ సంవత్సరం నవంబర్ నెలలో మరో నాలుగు వేల రూ॥ అందించనున్నారు. రాష్ట్రంలో సాగులోనున్న మొత్తం భూమి 1 కోటీ 40 లక్షల ఎకరాలు కాగా, రెండు విడతలలో ప్రభుత్వం ఈ పథకం క్రింద 11,200 కోట్ల రూ॥ ఖర్చు చేయనుంది.

ప్రపంచబ్యాంకు సహాయంతోనే అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం ఉనికిలో వున్న భూరికార్డులన్నింటినీ, ఈ మధ్యకాలంలోని మార్పులు, చేర్పులన్నింటినీ చేర్చి సరిచేసే ఒక కార్యక్రమాన్ని చేపట్టారు. 'డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునీకరణ పథకాన్ని' (డిఐఎల్‌ఆర్‌ఎంపి) ఒక దశాబ్దం క్రితమే ప్రారంభించారు. భూమి గురించి సమాచారం అనగా యాజమాన్యం, వినియోగం తదితరాలతోపాటు కేంద్ర అధికారులు ఎక్కడనుండైనా ఆ భూమి గురించిన తాజా సమాచారాన్ని తెలుసుకునే విధంగా భూ రికార్డులను నమోదు చేయటం ఈ పథకం లక్ష్యం. అయితే ఇది అనుకున్నంతగా ముందుకు సాగలేదు. భూములన్నింటినీ సర్వేచేసి, ఆ భూయజమాని వివరాలతో పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీచేయటం తన బుర్రలో పుట్టిన బుద్ధిగా ముఖ్యమంత్రి చెప్పుకుంటున్నాడు. దీనిని అత్యంత తక్కువ సమయంలో పరిపూర్తి చేశామని, ఆ కారణంగానే రైతుబంధు పథకాన్ని విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని గొప్పగా చెప్పుకుంటున్నాడు.

అధికారిక సమాచారం ప్రకారం 58 లక్షల పాస్‌పుస్తకాలకుగానూ మే 20 నాటికి 44 లక్షల పుస్తకాలు మాత్రమే తయారై, వాటి పంపిణీతో పాటే ఎకరాకు రూ.4 వేలు చొప్పున అందచేశారు. పంపిణీ చేసిన వాటిలోని పదిలక్షల పాస్ పుస్తకాల తయారీలో పేర్లు తప్పుగా ముద్రించటం, సర్వే నెంబర్లు తప్పుగా పేర్కొనటం జరిగింది. అదేవిధంగా ఈ 44 లక్షల బ్యాంకు చెక్కులలో కేవలం 17 లక్షల చెక్కులు మాత్రమే బ్యాంకులకు చేరాయి. పేర్లు, సర్వే నెంబర్లలో తప్పులు, ఆధార్ నెంబరు, ఖాతా నెంబర్లలలో తప్పులు తదితర వివిధ కారణాలతో వీటిలో అత్యధిక చెక్కులను భూయజమానులు డబ్బు రూపంలో మార్చకుండా నిలిపి వుంచారు. దీనితో రైతులు వీటన్నింటినీ సరిచేయించుకోవటానికి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆచరణలో ఎదురౌతున్న ఈ ఇబ్బందులను ప్రక్కనుంచితే, ఈ పథకం వెనుక ఆలోచించవలసిన పెద్ద విషయాలున్నాయి. ఆదివాసుల భూములు అత్యధికం పరాయీకరణకు గురయ్యాయి. ఆ భూములన్నీ గిరిజనేతరుల చేతుల్లో వున్నాయి. అధికారిక సర్వే ప్రకారం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 60 శాతం, వరంగల్ జిల్లాలో 71 శాతం, ఖమ్మం జిల్లాలో 52 శాతం భూములు, ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందుకాలంలోనే ఆదివాసులనుండి పరాయీకరణకు గురయ్యాయి. తెలంగాణాలో ఆదివాసులు అత్యధికం ఈ జిల్లాలలోనే నివశిస్తారు. ఈ రైతుబంధు పథకం ఆదివాసీ భూముల పరాయీకరణకు చట్టబద్ధత చేకూర్చి, ఆ భూములను తమ అధీనంలో వుంచుకున్న గిరిజనేతరుల చట్ట విరుద్ధ ఆక్రమణలకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇచ్చివేశారు.

ప్రభుత్వ బంజరు, ఈనాము, మాన్యం, తదితర పేర్లతో లక్షలాది ఎకరాల భూములున్నాయి. చట్ట ప్రకారం ఇవన్నీ భూమిహీనులైన నిరుపేద గ్రామీణులకు ఇవ్వాలి. అయితే గ్రామీణ ప్రాంతంలోని నోరుగల ఆసాముల స్వాధీనంలోనే ఈ భూములన్నీ వున్నాయి. ఈ భూములన్నీ బినామీల పేరుతో ఇతరులకు బదిలీ అయినట్లు చూపారు. (తెల్లకాగితంపై ఒప్పందం రాసుకొని, సంతకాలు తీసుకొని) చట్టంలో పేర్కొన్న అంశాల్ని గాలికొదిలేసిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూములన్నిటికీ పాస్ పుస్తకాలు అందజేసి, ఈ ఆక్రమణల్నింటినీ చట్టబద్ధం చేసింది.

రైతుబంధు పథకంలోని మరో ముఖ్యమైన సమస్య ఏమంటే, ఈ పథకం కౌలు రైతాంగాన్ని ఏవిధంగానూ లెక్కలోకే తీసుకోలేదు. వాస్తవానికి అత్యధిక భూములను సాగుచేసి పంటలు పండించేది కౌలు రైతులే. రాష్ట్రంలో 6 లక్షలమంది కౌలు రైతులున్నారు. వీరంతా సెంటో కుంటో వున్న పేదరైతులుగా కానీ లేదా వ్యవసాయకూలీలుగా కానీ వుండి కౌలు చేసుకుంటున్న వారిగా వున్నారు. ఈ అంశాన్ని రైతుబంధు అంశంలో జోడిస్తే, భూయజమానులకు సమస్యలు ఏర్పడతాయంటూ ఈ విషయాన్ని ఎత్తిచూపినపుడు ముఖ్యమంత్రి నిర్మొహమాటంగా పేర్కొన్నాడు. వారెవరూ కౌలుదారులుగా నమోదు కాలేదు కనుక వారెవరికీ సేద్యపు మదుపు అందదన్నమాట! చట్టప్రకారం విధి విధానాలన్నింటినీ పాటిస్తూనే దేవాలయ మాన్యం భూములను కౌలుచేసుకుంటున్న రైతులకు కూడా వారంతా కౌలురైతులనే పేరిట రైతుబంధు పథకం వర్తించకుండా నిరాకరించారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయశాఖకు కౌలు చెల్లిస్తూ వ్యవసాయం చేసుకుంటున్న వారే వీరంతా.

రైతుల అనేక దీర్ఘకాలిక పోరాటాల ఫలితంగా 1950లో కౌలురైతుల రక్షణచట్టం ఉనికిలోకి వచ్చింది. ఈ చట్టంప్రకారం మూజువాణి కౌలు కాకుండా, కౌలుదారుని నమోదు చేయాల్సి వుంటుంది. అయితే గత 7 దశాబ్దాల కాలంలోనూ ఏనాడూ ఇది అమలుకు నోచుకోలేదు. భూయజమానులకు, రైతులకు నడుమ కౌలు ఒప్పందాలు కేవలం నోటిమాటగానే జరిగిపోతున్నాయి. 1950 చట్టంలోని సెక్షన్ 10(4) ప్రకారం, కౌలు రైతులకు కూడా వ్యవస్థాగత రుణం కల్పించవచ్చు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం, కౌలురైతులకు రుణఅర్హత సర్టిఫికెట్లు (ఎల్ఇసి) మంజూరు చేసింది. ఈ పథకం అనేక సమస్యలతో కూడుకొని, చాలా కొద్దిమంది కౌలు రైతులు మాత్రమే లబ్ధిపొందగా, అత్యధిక కౌలు రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుత టిఆర్ఎస్ ప్రభుత్వం కౌలురైతులకు ఎల్ఇసిలను మంజూరుచేసే ప్రక్రియను నిలిపివేయాలని అధికారులను ఆదేశించింది. అంతేగాక, భూయజమానులకు ఇబ్బందికరంగా వుందనే సాకుపై ఆధారపడే 1950 నాటి కౌలురైతు రక్షణ చట్టాన్ని ఒక ఆర్డినెన్స్ ద్వారానైనా రద్దుచేయాలని సూచించింది.

'దున్నేవానికే భూమి' డిమాండ్‌ను సాధించు కోవటానికి రైతులు నిరంతరాయంగా ఎన్నో గొప్ప పోరాటాలు నిర్వహించిన రాష్ట్రంలో ఇది ఖచ్చితంగా రైతాంగానికి వ్యతిరేకంగా చేబట్టే తిరోగమన చర్యగా వుంటుంది.

ఇదే ముగింపు కాబోదు. రానున్న కాలంలో సంస్కరణల పేరిట మరిన్ని చర్యలు రాబోతున్నాయి. భారత ప్రభుత్వ సలహాదారుగా వుండి పదవీ విరమణ చేస్తున్న అరవింద సుబ్రహ్మణ్యం ఈ అంశాల్ని తెలియజేశాడు. తెలంగాణా రైతుబంధు పథకాన్ని భవిష్యత్తు భారతదేశ పథకంగా తయన కొనియాడాడు. (23-7-18 బిజినెస్ స్టాండర్డ్) ఆయన దీనిని క్యోబి (క్యుయుబిఐ-క్యాజీ యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం) పథకంగా పేర్కొన్నాడు. "రైతుబంధు పథకం ఒక సామాజిక విధానంగాకంటే ప్రధానంగా ఓ వ్యవసాయ విధానంగా ఉద్దేశించి వుండవచ్చు. వాస్తవానికి, ఈ దృక్పథంనుండి పరిశీలిస్తే, ఇది భవిష్యత్ వ్యవసాయ విధానంగా వుండగలదు. ప్రస్తుత వ్యవస్థలో వ్యవసాయానికి ప్రభుత్వ మద్దతు ఎలా వుందో చూద్దాం. ఇక్కడ మొదలుకొని, ప్రపంచ నలుమూలలా ఎన్నో పథకాలు అమలులో వున్నాయి. పంటలు పండకపోతే పంటల బీమా, రుణమాఫీ వంటి పథకాలెన్నో వున్నాయి. అలాగే పంటలు బాగా పండితే, మద్దతు ధరలు మరియు సేకరణ, ప్రోత్సహకాలు తదితర పథకాలున్నాయి. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, విద్యుత్తు, నీరు మొదలైన వాటిపై సబ్సిడీలు అందించే స్వతంత్ర పథకాలూ వున్నాయి.

ఈ పథకాలకు రైతుబంధు పథకం ఈరోజు తోడైంది. కనుక ఇది ఆర్థికంగా కొనసాగలేనిదిగా రూపొందుతుంది. ఏమైనా, పైన పేర్కొన్న అన్ని పథకాలకో, లేదా కొన్ని పథకాలకో బదులుగా రైతుబంధు పథకాన్ని ఉపయోగిస్తే మూడు కీలకమైన ప్రయోజనాలు సాధ్యమౌతాయి.

రాష్ట్రసామర్థ్యం, పాలనాయంత్రాంగం అలాగే ఆర్థిక వనరులను మిగుల్చుకోగలగటం మొదటి అంశం.

తీవ్ర తప్పిదాలను నివారించి ఉత్పత్తిని, వ్యవసాయ ఆదాయాన్ని విడగొట్టటం రెండవ అంశం.

బదిలీ అయిన మొత్తాదును పెంచటంద్వారా ఆదాయాలు తగినంతగా, వేగంగా పెరగటానికి తోడ్పడటం మూడవ అంశం. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకొని ఈ విధంగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో ఎరువులకు, విద్యుత్తుకు సబ్సిడీని రద్దుచేయటంవలన ప్రభుత్వం ప్రతి వ్యవసాయదారునికి 92,000 రూ॥లను లేదా ప్రతి వ్యవసాయ కార్మికునికి 50,000 రూ॥లను ఒక సం॥లో ఆర్థిక మద్దతునీయ గలుగుతుంది".

అరవింద సుబ్రహ్మణ్యం యొక్క ఈ సుదీర్ఘ ప్రకటనకు వివరణ అక్కరలేదు. అది స్పష్టంగానే వుంది. భారత ప్రభుత్వ ఆర్థిక సలహాదారు నోటి నుండి ఈ మాటలు వచ్చాయంటే రాజకీయ అధికార వర్గాలలో ఏం జరగబోతోందో ఎవరైనా ఊహించవచ్చు. రానున్న కాలంలో రైతులకు ఇచ్చే సబ్సిడీలన్నింటినీ తొలగించివేసే ఒక పెద్ద విధానంలో భాగంగా తెలంగాణాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన విధానమే రైతుబంధు. శ్రమచేయవద్దని డబ్బుల ఆశజూపి రైతాంగాన్ని లొంగదీసుకునే విధానమిది. ఈ పథకాలన్నింటి యొక్క అంతిమ లక్ష్యమేమంటే, రైతాంగాన్ని భూములనుండి పరాయీకరించటమే. అలాగే భారత వ్యవసాయరంగాన్ని, సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడికి సేవలందించే మార్కెట్‌శక్తుల కనుగుణంగా మలచటానికేననేది స్పష్టం.

ooooo